క్లుప్తంగా

ఘనంగా జ్యోతిబాపూలే వర్ధంతి



నివాళులర్పిస్తున్న బీసీ జాగృతి నాయకులు

పాతమంచిర్యాల: జిల్లాకేంద్రంలో తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతి బాపూలే 133వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బెల్లంపల్లి చౌరస్తాలో జ్యోతిబాపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను కోరినా పట్టించుకోలేదన్నారు. విగ్రహ నిర్మాణం అనుమతి ఇవ్వడంలో ఆలసత్వం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.మల్లేశ్, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్, మహిళా అధ్యక్షులు ఆకుతోట పద్మ దేవి, యువ జాగృతి అధ్యక్షురాలు కల్యాణి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

కోటపల్లి: మండలంలోని కోటపల్లి సెక్టార్ పరిధిలోని కోటపల్లి, సర్వాయిపేట, ఏసన్వాయి, ఎడగట్ట, పిన్నారం, పార్‌పల్లి పోలింగ్ కేంద్రాలను మంగళవారం సెక్టార్ అధికారి బద్రీనాథ్‌స్వామి పరిశీలించారు. కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల ఉదారత

జన్నారం: మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన చిట్యాల చంద్రశేఖర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకునే స్థోమత లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రూ.18,100 నగదు అందించి ఉదారత చాటుకున్నారు. ఇదే పాఠశాలలో పదో తరగతి వరకు చదివిన చంద్రశేఖర్‌కు ఉపాధ్యాయులు పోగుచేసిన నగదును మంగళవారం కుటుంబీకులకు అందించినట్లు హెచ్‌ఎం కట్ట రాజమౌళి తెలిపారు. బాదంపల్లి హెచ్‌ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

జన్నారం: జన్నారం ఎంపీటీసీ, ఎంపీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎండీ రియాజొద్దీన్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన ఆయనతోపాటు పలువురికి వెడ్మ బొజ్జు గులాబీ కండువా కప్పారు. పార్టీ కార్యాలయం ఎదుట రియాజొద్దీన్‌ను అభిమానులు మంగళవారం సన్మానించారు.

చెన్నూర్‌రూరల్: సుద్దాల, ఎల్లక్కపేట గ్రామాల్లో సుమారు 50మంది మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు మూల రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, పార్టీ నాయకుడు చల్ల రాంరెడ్డిలు వారికి గులాబీ కండువా కప్పారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



సర్పంచ్‌కు కండువా కప్పుతున్న జాన్సన్‌నాయక్

జన్నారం: జన్నారం సర్పంచ్ బూసవేని గంగాధర్‌గౌడ్ కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ సమక్షంలో మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్వర్ అలీఖాన్, ఫజల్‌ఖాన్, రవి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి కౌన్సిలర్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీకి చెందిన 4వ వార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ మోతె సుజాత మంగళవారం బీజేపీలో చేరారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘునాథ్ ఆమెకు పార్టీ కండువా కప్పారు.

కళాకారులకు సన్మానం

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా సోమవారం రాత్రి శశిరేఖ పరిణయం నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాటకాన్ని ప్రదర్శించిన కళాకారులకు సంస్కార భారతి జాతీయ సాంస్కృతిక సంస్థ జిల్లాకన్వీనర్ సత్యనారాయణ మంగళవారం సన్మానించి, జ్ఞాపికలు అందించారు. సంస్కార భారతి సలహాదారు దక్షిణామూర్తి, సభ్యులు రాజయ్య, ఉపేందర్, లక్ష్మణ్, తిరుపతిగౌడ్, తిరుపతి, జయాకర్, భీమయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సీసీఐ జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోళ్లను బుధ, గురువారాల్లో నిలిపివేయనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఈనెల 29, 30వ తేదీల్లో పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నామని, రైతులు సహకరించాలని కోరారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- జైపూర్ ఏసీపీ మోహన్

చెన్నూర్: ఎన్నికల విధుల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జైపూర్ ఏసీపీ మోహన్ అన్నారు. పట్టణంలోని హబీబ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం పోలీసు బలగాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికల అధికారులు కేటాయించిన పోలింగ్ బూత్‌లకు బుధవారం బలగాలు తరలివెళ్లాలన్నారు. గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు ప్రజలు సెల్‌ఫోన్లతోపాటు ఇతర సామగ్రిని వెంట తీసుకురావద్దని సూచించారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో



మాట్లాడుతున్న ఏసీపీ మోహన్

జరిగేలా ఓటర్లు పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఐలు వాసుదేవరావు, విద్యాసాగర్, జైపూర్ సబ్ డివిజన్ సీఐలు, ఎస్సైలు, పారామిలటరీ బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

'తెలంగాణలో వచ్చేది పేదల ప్రభుత్వం'

చెన్నూర్: తెలంగాణలో వచ్చేది పేదల ప్రభుత్వమని, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించి సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని ఆ పార్టీ స్టార్ క్యాంపెయినర్ తీన్మార్ మల్లన్న అన్నారు. మంగళవారం చెన్నూర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం నుంచి పాతబస్టాండ్ వరకు రోడ్ షో నిర్వహించారు. మారుతీ హనుమాన్ మందిర్ ఎదుట సభలో మల్లన్న మాట్లాడారు. సిరిసిల్లలో కేటీఆర్ గెలిచే పరిస్థితి లేదని, ఇక్కడ బాల్క సుమన్‌ను గెలిపిస్తానని వచ్చిండని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వివేక్‌ను గెలిపించాలన్నారు. రోడ్ షోలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు ఫయాజ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు మినిమమ్ వేజెస్‌కు కృషి

మందమర్రిరూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు మినిమమ్ వేజెస్ ఇప్పించడానికి కృషిచేస్తానని చెన్నూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వివేక్ పేర్కొన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏరియాలోని వర్క్



మాట్లాడుతున్న మల్లన్న, పక్కన వివేక్

షాపు సమీపంలో నిర్వహించిన సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్యతో కలిసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ గుర్తింపు కార్మిక సంఘంగా గెలిచి సింగరేణిని దోచుకుందని ఆరోపించారు. ఎమ్మెల్యే బాల్క సుమన్ నియోజకవర్గంలోని ఇసుక, బొగ్గు దందా చేస్తూ అక్రమంగా కోట్లాది రూపాయలు సంపాదించారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, దోపిడీకి మారుపేరుగా బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ నిలిచాయని మండిపడ్డారు. ప్రచారంలో కాంగ్రెస్, సీపీఐ, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

'బాల్క సుమన్‌ను గెలిపించాలి'

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన బాల్క సుమన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓయూ, శాతవాహన యూనివర్సిటీల జేఏసీ ఫౌండర్, చైర్మన్లు మందాల భాస్కర్, చెన్నమల్ల చైతన్య కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నిరుద్యోగులను ఒక ఎరలాగా వాడుకుంటూ అధికార పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. నాయకులు అరుణ్‌కుమార్, రాంమూర్తి, బత్తుల పవన్, మురళి, రాజశేఖర్, రవికుమార్, విజయ్, రమేశ్ పాల్గొన్నారు.

జైపూర్: చెన్నూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ పెంట అజయ్‌పటేల్ అన్నారు. మంగళవారం జైపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 40 ఏళ్లలో లేని అభివృద్ధి బాల్కసుమన్ చెన్నూర్‌లో చేసి చూపించారని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పోతరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి మధుకర్, శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓయూ జేఏసీ నాయకులు

బీఆర్‌ఎస్ బైక్‌ర్యాలీ

మందమర్రిరూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం చివరి రోజు కావడంతో బీఆర్‌ఎస్ నాయకులు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో చెన్నూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్కసుమన్‌కు ఘన స్వాగతం పలికారు. సుమన్ పార్టీ నాయకులతో కలిసి ర్యాలీగా మార్కెట్‌కు చేరుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెన్నూర్ అభివృద్ధి కావాలంటే ప్రజలు కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న బాల్క సుమన్

'అభివృద్ధి చేస్తా ఓటేయండి'

శ్రీరాంపూర్: మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇస్తున్నానని, తనకు ఓటేసి గెలిపించాలని మంచిర్యాల బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘునాథరావు కోరారు. మంగళవారం ఆయన సీసీసీ కార్నర్‌లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపిస్తే ఈ ప్రాంతంలో విద్య, వైద్య సదుపాయాలను మరింత మెరుగుపరుస్తానన్నారు. సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను మాఫీ చేస్తామని మేనిఫెస్టో పెట్టిన ఏకైక పార్టీ తమదేనన్నారు. ఈసారి కమలం పువ్వుకు ఓటేసి గెలిపించాలన్నారు. నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అగల్ డ్యూటీ



మాట్లాడుతున్న రఘునాథ్‌రావు

రాజు, బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, నాయకులు బరుపటి మారుతి, సత్రం రమేశ్, పి.కమలాకర్‌రావు, ఈర్ల సదానందం, ఎనగందుల కృష్ణమూర్తి, రంగారావు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించండి'

శ్రీరాంపూర్: ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావు కోరారు. మంగళవారం ఆర్కే న్యూటెక్ గనిపై ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. సింగరేణిలో అనేక సంక్షేమ కార్యక్రమాలు నేడు అమలవుతున్నాయంటే దానికి కారణం ముఖ్యమంత్రి కేసీఆరేనన్నారు. జాతీయ సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను కూడా ఆయన ఇప్పించారన్నారు. మూడోసారి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సర్కారు వస్తే కార్మికులకు మరిన్ని సౌకర్యాలు, హక్కులు లభిస్తాయని తెలిపారు. యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు డి.అన్నయ్య మంద మల్లారెడ్డి



మాట్లాడుతున్న వెంకట్రావు

చర్చల ప్రతినిధి ఏను రవీందర్‌రెడ్డి, జీఎం కమిటీ సభ్యులు వెంగళ కుమారస్వామి, పెట్టం లక్ష్మణ్, నాయకులు పానుగంటి సత్తయ్య కానుగంటి చంద్రయ్య అశోక్ జగదీశ్వర్‌రెడ్డి, జక్కుల రాజేశం, మైపాల్‌రెడ్డి, జంపయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

కాసిపేట: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలకు న్యాయం జరుగుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్ అన్నారు. మండలంలోని ట్యాంకు బస్తీలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లలో కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుందని ఆరోపించారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారన్నారు. దళితబంధు, బీసీ బంధు, డబుల్‌బెడ్రూం, గృహలక్ష్మి పథకాలు అర్హులకు అందలేదన్నారు. ప్రజలు తనను ఈసారి గెలిపిస్తే అభివృద్ధిచేసి చూపిస్తానన్నారు.



ప్రచారంలో పాల్గొన్న వినోద్

సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు సపాటు శంకర్, ఉపసర్పంచ్ కనుకుల రాకేశ్, మాజీ సహకార సంఘం చైర్మన్ వంశీధర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాల అభివృద్ధే లక్ష్యం

- మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల నుంచి మంచిర్యాలలోని ఐబీ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, రైల్వేస్టేషన్ రోడ్డు, ఓవర్ బ్రిడ్జి, నస్పూరు మీదుగా శ్రీరాంపూర్ వరకు మంగళవారం బైక్‌ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాలను 25 ఏళ్ల వెనక్కు నెట్టారన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న దివాకర్‌రావుకు ఎలాంటి విజన్ లేదని, తన అనాలోచిత నిర్ణయాలతో మంచిర్యాలను అధోగతి పాలు చేశారని ధ్వజమెత్తారు. డీసీసీ అధ్యక్షురాలు సురేఖ మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో ప్రేంసాగర్‌రావును గెలిపించాలని కోరారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

శ్రీరాంపూర్: తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాలని మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేంసాగర్‌రావు కోరారు. మంగళవారం ఆయన నస్పూర్ తోళ్లవాగు నుంచి సీసీసీ కార్నర్, శ్రీరాంపూర్ బస్టాండ్ వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహిచారు. సీసీసీ కార్నర్, శ్రీరాంపూర్ బస్టాండ్ చౌరస్తాల వద్ద హాజరైన అశేష జనాన్ని ఉద్దేశించి



మంచిర్యాలలోని రోడ్‌షోలో మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు



సీసీసీ కార్నర్ వద్ద మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు

ఆయన మాట్లాడారు. తను డబ్బులు సంపాదించడానికి రాజకీయాల్లోకి రాలేదన్నారు. కేవలం ఈ ప్రాంతంలో పుట్టి పెరిగినందున ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో విద్యార్థుల కోసం యూనివర్సిటీ ఏర్పాటు చేయిస్తానన్నారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య మాట్లాడుతూ ప్రేంసాగర్‌రావును గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, సీపీఐ జిల్లా కార్యదర్శి శంకర్, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సుర్మిళ్ల వేణు, ఐఎన్టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు జె.శంకర్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్, 13వ వార్డు కౌన్సిలర్ నల్ల శంకర్, మరికొందరు తన అనుచరులు, మాజీ ప్రతినిధులతో కలిసి మంగళవారం మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వివిధ పార్టీలకు చెందిన దాదాపు 300లకు పైగా పలువురు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

- మంచిర్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు

శ్రీరాంపూర్: గడిచిన పదేళ్లలో తెలంగాణలో జరిగిన అభివృద్ధిని చేసి మరోమారు బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని మంచిర్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే దివాకర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీరాంపూర్‌లో ఆ పార్టీ నేతలు, టీబీజీకేఎస్ నాయకులు కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రగతి మైదానంలో ర్యాలీని ప్రారంభించి ఆయన మాట్లాడారు. అభివృద్ధి సంక్షేమ ఫలాలు మున్ముందు పొందాలంటే బీఆర్‌ఎస్ అధికారంలో ఉండాలన్నారు. కాంగ్రెస్, బీజేపీకి ఓటేసి గెలిపిస్తే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయన్నారు. సింగరేణి కార్మికులకు వారసత్వ ఉద్యోగాలను కల్పించింది సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ భానుప్రసాద్ మాట్లాడుతూ సింగరేణికి భవిష్యత్తు ఉండాలన్నా, మరింత అభివృద్ధి జరుగాలన్నా మరోసారి సీఎం కేసీఆరే ఉండాలన్నారు. నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బయ్య, మంచిర్యాల మార్కెట్‌కమిటీ చైర్మన్ భూమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించండి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం కావాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని మంచిర్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు కోరారు. ఐబీ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, ముఖరం చౌరస్తాల మీదుగా మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బైక్‌ర్యాలీ, రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు.



మంచిర్యాల రోడ్‌షోలో దివాకర్‌రావు

'విదేశాల్లో ఆస్తులకు సమాధానం చెప్పాలి'

విదేశాల్లో భూములు, ఆస్తులపై మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థి ప్రేంసాగర్‌రావు సమాధానం చెప్పాలని దివాకర్‌రావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మాట్లాడారు. ప్రేంసాగర్‌రావుకు మలేషియాలో 300ల ఎకరాల భూమి, కారు, ఇల్లు ఉన్నాయని వార్తలు వస్తున్నాయని అన్నారు. తప్పుడు వివరాలు ఇచ్చి గెలిచిన వ్యక్తి, అఫిడవిట్‌లోని అదే తప్పుడు వివరాలతో అనర్హుడు అవుతాడని తెలిపారు. మంచిర్యాల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ భానుప్రసాద్, అత్తి సరోజ, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, బీఆర్‌ఎస్ నాయకులు సత్యం, సరోజ పాల్గొన్నారు.



శ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న దివాకర్‌రావు

దివాకర్‌రావును గెలిపించండి

దండేపల్లి: ఎమ్మెల్యేగా దివాకర్‌రావును గెలిపించాలని కోరుతూ ఆయన తనయులు రంజిత్‌రావు, విజిత్‌రావులు దండేపల్లి మండలం తాళ్లపేట నుంచి కన్నెపల్లి వరకు మంగళవారం కార్యకర్తలతో కలసి బైక్‌ర్యాలీ నిర్వహించారు. వైస్ ఎంపీపీ అనిల్, రైతుసమితి జిల్లా కన్వీనర్ గురువయ్య పాల్గొన్నారు.

చిన్నయ్యను ఆదరించండి

- పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత

తాండూర్/కాసిపేట: బెల్లంపల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్యను ప్రజలు మరో సారి ఆదరించాలని పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ వెంకటేశ్ నేత అన్నారు. తాండూర్ మండలంలోని కొత్తపల్లి, కిష్టంపేటలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్యే అభ్యర్థి చిన్నయ్య సతీమణి జయతార, కుమార్తెతో కలిసి ప్రచారం చేశారు. జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు. కాసిపేట మండలం దేవాపూర్‌లో జరిగిన ప్రచారంలో బెల్లంపల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, ఎంపీపీ లక్ష్మి, వైస్ ఎంపీపీ విక్రమ్‌రావు, జెడ్పీటీసీ చంద్రయ్య, సర్పంచ్ ఆడె జంగు ఉన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ వెంకటేశ్ నేత

కార్తీక పూజలు

మంచిర్యాలఅర్బన్: కార్తీకమాసం సందర్భంగా మంగళవారం స్థానిక విశ్వనాథ ఆలయంలో దీపారాధన, అర్చకులు దానం చేశారు. అనంతరం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గౌతమినగర్ కోదండ రామాలయంలో ఉసిరి చెట్టు కింద వనభోజనాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సిరిపురం రాజేశ్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్, బీజేపీలను బొంద పెట్టాలి'

చెన్నూర్: రాష్ట్రం, కేంద్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్, బీజేపీలను అసెంబ్లీ ఎన్నికల్లో బొంద పెట్టాలని భారత్ బచావో రాష్ట్ర కమిటీ నాయకుడు ఒడ్డెపల్లి మనోహర్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు చీకటి ఒప్పందం కుదుర్చుకున్నాయన్నారు. ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ కోట్ల రూపాయలు దండుకుని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. కేసీఆర్ రైతుబంధు పేరు చెప్పి భూస్వాములకు లాభం చేకూరుస్తున్నారని ఆరోపించారు. జిల్లా చైర్మన్ మల్లయ్య, రాష్ట్ర సభ్యులు సమ్ము రాజయ్య, సుంక లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పొనకల్‌లో బీజేపీ ర్యాలీ

జన్నారం: ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పొనకల్ వారసంతలో నాయకులతో ఖానాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాథోడ్ రమేశ్ ర్యాలీ తీశారు. వివిధ గ్రామాల కార్యకర్తలు, యువకులు బస్టాండ్ నుంచి అంగడిబజార్ వరకు భారీ ర్యాలీ తీశారు. రితీశ్‌రాథోడ్, శంకరయ్య, మధుసూదన్ రావు, బద్రినాయక్, గోలి చందు ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్

ఖానాపూర్: నియోజకవర్గ అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి భుక్య జాన్సన్‌నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. మంత్రి కేటీఆర్ సహకారంతో ఖానాపూర్‌ను సుందరంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. అనంతరం పార్టీ శ్రేణులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంకం రాజేందర్, ఖలీల్, పరిమి సురేశ్, లత, కారింగుల సంకీర్తన, సుమన్, జన్నారపు విజయలక్ష్మి, కావలి సంతోశ్, తొంటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ప్రజలు ఆలోచించి ఓటేయండి

కడెం: ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటేయాలని ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు పైడిపల్లి రవీందరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. ఈసందర్భంగా దస్తురాబాద్ మండలం అకొండపేట్‌కు చెందిన పలువురు ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. రవీందర్‌రావు పేదల భూములు గుంజుకున్నారని కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సుధాకర్ రావు, వెంకటేశ్, రాజన్న, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ భారీ బైక్ ర్యాలీ

జన్నారం: మండలంలో ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 500 మంది బైక్‌ర్యాలీలో పాల్గొన్నారు. జన్నారం మండలం ధర్మారం, కలమడుగు, ఇందన్‌పల్లి గ్రామాల మీదుగా జన్నారం వరకు ర్యాలీ కొనసాగించారు. నాయకులు ముజాఫర్ అలీఖాన్, రాజశేఖర్, మోహన్ రెడ్డి, సుభాష్‌రెడ్డి, ముత్యం రాజన్న, శంకరయ్య, ఎన్ఎస్‌యూఐ కార్యదర్శి సోహేల్ తదితరులు పాల్గొన్నారు.



కలమడుగులో ర్యాలీ తీస్తున్న నాయకులు